

ఘనంగా అంకాలమ్మ బోనాలు


వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అంకాలమ్మ బోనాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.



సామూహిక కుంకుమార్చన

చెరుకుపల్లి: శ్రావణమాసం పురస్కరించుకుని గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన అంగరంగ వైభవంగా జరిగింది.

మహాలక్ష్మిగా చందోలు బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మి స్వరూపంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉగ్రరూప కృష్ణమ్మ

- జిల్లాలో ఆదివారం తగ్గుముఖం పట్టిన వర్షాలు
- అయినా తగ్గని వరద ఉధృతి
- వరద నీటితో పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- రెంటచింతల వద్ద తాత్కాలిక బ్రిడ్జి కోతకు గురవడంతో మాచర్ల – గుంటూరు మధ్య నిలిచిన రాకపోకలు
- జలదిగ్బంధంలో నదీ పరివాహక లంక గ్రామాలు
- అమరావతి, అచ్చంపేట మండలాల్లో 50 మంది గొర్రెల కాపరులు, 3,501 గొర్రెలను కాపాడిన పోలీసు, రెవెన్యూ సిబ్బంది

ఉధృతంగా కృష్ణానది.. మహోగ్రంగా వాగులు



దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల గ్రామంలోకి చేరిన కృష్ణానది వరద నీరు

సాక్షి, నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధాటికి గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఆదివారం కొంత విరామం ప్రకటించాయి. ఆదివారం ఉదయం కొద్దిసేపు చినుకులు కురిసినప్పటికి ఇబ్బందికరంగా లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రజానీకం ఊపిరి పీల్చుకున్నారు. శుక్ర, శనివారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇంకా పలు లోతట్టు గ్రామాలు వరదనీటిలోనే చిక్కుకుపోయాయి. దీంతో జిల్లాలో అమరావతి, క్రోసూరు, నాదెండ్ల మండలాల పరిధిలో ఆరు పునరావాస కేంద్రాలను జిల్లా రెవెన్యూశాఖ ఏర్పాటు చేసింది. మరోవైపు సోమ, మంగళవారాల్లో సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. దీంతో ప్రజల్లో ఆందోళన ఇంకా కొనసాగుతోంది. అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. సోమవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ సెలవు ప్రకటించింది.

- కృష్ణానదిలో సుమారు 7 లక్షల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తుండటంతో నది పరివాహక ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో పలు గ్రామాల ప్రజలు భయం భయంతో గడుపుతున్నారు. వరద ఉధృతితో పలు గ్రామాలకు ఇంకా రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగి రైతులకు కన్నీటిని తెప్పించాయి. అమరావతి మండలం పెదమద్దూరు వాగుపై చప్టా పూర్తిగా నీట మునగటంతో విజయవాడ–అమరావతిలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట



అమరావతి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

నీట మునిగింది. పత్తి, మిరప, అపరాల పంటలకు కొంత మేరనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అయితే సోమవారం నుంచి కొనసాగితే రైతన్నలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల 303 రైతులకు చెందిన 275 హెక్టార్ల ఉద్యాన పంటలు నష్టపోయినట్టు జిల్లా ఉద్యానవన శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వరద తగ్గిన తరువాత పూర్తిస్థాయిలో నష్టం అంచనా వేయనున్నారు.

- వరద ఒక్కసారిగా ముంచెత్తడంతో పలు లంక గ్రామాల్లో గొర్రెల కాపరులు, గొర్రెలు చిక్కుకుపోయారు. అమరావతి మండలంలో వైకుంఠపురం, అమరావతి, గిడుగు, పొందుగల, మునుగోడు, ధరణికోట లంక గ్రామాలకు చెందిన 36 మంది గొర్రెల కాపరులు, 1500 గొర్రెలను కాపాడి ఒడ్డుకు చేర్చారు. అలాగే అచ్చంపేట మండల పరిధిలోని కొనూరు, కస్తాల, చామర్రు లంక గ్రామాలలో చిక్కుకొన్న 14 మంది గొర్రెల కాపరులు, 2001 గొర్రెలను వెరసి మొత్తం జిల్లాలో 50 మంది గొర్రెల కాపరులు, 3,501 గొర్రెలను యుద్ధప్రాతిపదికన 14 బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి సంబంధిత రెవెన్యూ, పోలీసు సిబ్బంది తరలించారు. సహాయ చర్యలను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌లు పరిశీలించారు.
- అచ్చంపేట–కొత్తపల్లి మధ్యగల దోనపాటి చెరువుకు ఆదివారం ఉదయం గండిపడింది.
- పెదకూరపాడు మండలవ్యాప్తంగా వర్ష బీభత్సం సృష్టించింది. పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కొట్టుకుపోయాయి. చప్టాలు కుంగిపోయాయి. పలు పంటలు నీటిలో మునిగాయి. పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.
- రొంపిచర్ల సమీపంలో కారంపూడి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే గాడిదలవాగు, చక్రాలవాగు, నక్కలవాగు, కొండవాగు, గొల్లవాగు, చవిటివాగు, ఎద్దువాగు, ఊరవ వాగు, ఓగేరువాగు, ఏడుగడియలవాగులు తదతర వాగులన్నీ ప్రమాద స్థాయిలో ప్రవహించాయి. ఓగేరువాగు ఉధృతివల్ల మాచవరం, మునుమాక, ముత్తనపల్లి గ్రామం వద్ద రాకపోకలు నిలిచాయి. గాడిదల వాగు, చక్రాలవాగు, చవిటివాగుల పరివాహక ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు చెరువులను తలపించాయి.
- నాదెండ్ల మండలం గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్ళే కుప్పగంజివాగు పొంగి చప్టాపై నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. నాదెండ్ల దంతెలవాగు, గొరిజవోలు ఉబ్బల వాగు పొంగి ప్రవహించాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతి వాగు వద్ద రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కాపలా కాశారు.
- శావల్యాపురం మండలంలోని కొత్తలూరు, చిన కంచర్ల గ్రామాల్లో కొంకెరు వాగు వర్షపు నీరు ఉధృతి ఆదివారం పెరగంతో పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తం అయారు. ఆయా గ్రామాల పరిధిలో గ్రామస్తులు ఇరువైపుల రాకపోకలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సూచించారు.

లాంచీలు నిలిపివేత

నాగార్జునసాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లనుంచి ఉధృతంగా వరద దిగువకు కొనసాగుతుంది. ఎగువనుంచి వస్తున్న వరదను బట్టి సాగర్ జలాశయం నుంచి 5 లక్షల క్యూసెక్కుల పైచిలుకే కృష్ణానదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో పాటు ఉదయం 7గంటల నుంచి వర్షం తగ్గడంతో సాగర్‌కు పర్యాటకులు తరలి వచ్చారు. 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా దిగువకు వరద కొనసాగుతోంది. ఆనకట్టకు దిగువన నదికి ఇరువైపుల పర్యాటకులు నిలబడి కృష్ణమ్మ అందాలను సందర్శించారు. మరోవైపు ఎగువ నుంచి వరదతీవ్రత ఎక్కు వగా ఉండటం, దీనికి తోడు ఈదురు గాలులకు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతుండటంతో నాగార్జున కొండకు వెళ్లే లాంచీలను నిలిపి వేశారు.

జిల్లాలో 3819.6 మి.మీ వర్షపాతం

నరసరావుపేట: అల్పపీడనం కారణంగా జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 3819.6 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా రొంపిచర్లలో 248.2 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా నాదెండ్లలో 83.8 మి.మీ వర్షం నమోదైంది. జిల్లాలో మండలాల వారీగా పడిన వర్షపాతం వివరాలు... నరసరావుపేటలో 125.4, మాచర్లలో 164.6, వెల్దుర్తిలో 135.4, దుర్గిలో 120.6, రెంటచింతలో 139.4 మి. మీటర్ల వర్షం కురిసింది. అలాగే గురజాలలో 146.0, దాచేపల్లిలో 156.0, కారెంపూడిలో 117.2, పిడుగురాళ్లలో 171.8, మాచవరంలో 180.6, బెల్లంకొండలో 130.6, అచ్చంపేటలో 190.6, క్రోసూరులో 167.4, అమరావతిలో 127.8, పెదకూరపాడులో 136.0, సత్తెనపల్లిలో 91.8, రాజుపాలెంలో 128.8, నకరికల్లులో 130.8, బొల్లాపల్లిలో 148.0, వినుకొండలో 85.8, నూజెండ్లలో 92.6, శావల్యాపురంలో 116.6, ఈపూరులో 94.8, ముప్పాళ్లలో 186.0, చిలకలూరిపేటలో 106.2, యడ్లపాడులో 97.4 మి. మీటర్ల వర్షం కురిసింది.

లంకలకు రాకపోకలు బంద్

పులిచింతల ప్రాజెక్టు నుంచి ఆదివారం సాయంత్రం 6.75 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు మొత్తం 24 క్రస్ట్ గేట్లు ఉండగా 21 గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. 9 గేట్లు 5 మీటర్లు, 10 గేట్లు 4 మీటర్ల, 2 గేట్లు 3 మీటర్లు పైకి లేపారు. ఎగువ నుంచి 6,36,945 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 41.98 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. ఇది 172.50 అడుగుల లోతుకు సమానం. ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని దిగువకు వదలడంతో సమీపంలోని కంచుబోడుతండా, జడపల్లితండాల ప్రవేశంలో వాగులపైకి నీళ్ల వచ్చి ఆయా తండాలకు రాకపోకలు స్తంభించాయి. అధికారుల సూచనలు చూస్తుంటే పులిచింతల నుంచి సోమవారం ఉదయానికల్లా 9 లక్షల క్యూసెక్కుల వరకు వదలవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీళ్లే కాకుండా అడవులలో కురిసిన వర్షపు నీళ్లు కూడా వచ్చి చేరే అవకాశాలున్నారు. దీంతో కృష్ణానదీ తీరప్రాంతాలవారిని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



రొంపిచర్ల మండలం ముత్తనపల్లి గ్రామం వద్ద రోడ్డుపైగా ప్రవహిస్తున్న వాగు

గుంటూరు–మాచర్ల మధ్య నిలిచిన రాకపోకలు

రెంటచింతల గ్రామ శివార్లోని గోలివాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మాచర్ల– గుంటూరు మధ్య శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. గోలివాగు నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన ఏర్పాటు చేసిన తాత్కాలిక బ్రిడ్జి వాగు ప్రవాహానికి కొంత కొట్టుకునిపోవడంతో పాటు బ్రిడ్జిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాగుపొంగి ప్రవహిస్తున్నందున ఈ గోతులు కన్పించకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలిక బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టే వరకు ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా మాచర్ల నుంచి కారెంపూడి మీదుగా గుంటూరుకు బస్ సర్వీసులను నడుపుతున్నారు. గోలి– జెట్టిపాలెం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న గోలివాగు 24 గంటల పాటు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ఏడు మంగళం వాగు ఉగ్రరూపం దాల్చడంతో రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలలో పల్లపు ప్రాంతాలలోని పంటపొలాలు ముంపునకు గురయ్యాయి.

న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

నరసరావుపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా పరిధిలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వ సెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. ఉత్తర్వులు మీరిన ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

నరసరావుపేట: రెండురోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే రెండురోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

తాడువాయి అడ్డవాగులో వ్యక్తి గల్లంతు

అచ్చంపేట: మండలంలోని తాడువాయి అడ్డ వాగులో వ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సంద్రతండాకు చెందిన భూక్యా గోపి తాడువాయి నుంచి నడుచుకుంటూ చప్టా పైనుంచి వెళ్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. పులిచింతల ప్రాజెక్టునుంచి 6.50లక్షల క్యూసెక్కులు వదలడంతో ఈ చప్టాపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తుల సహాయంతో వెదికినా ఆచూకీ దొరకలేదు.

నాగిరెడ్డిపాలెం కాలువకు గండి



బెల్లంకొండ: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వరద నీరు భారీగా వచ్చి చేరడంతో ఆదివారం ఉదయం మండలంలోని నాగిరెడ్డిపాలెం వద్ద మేజర్ కాలువకు గండి పడింది. నాగిరెడ్డిపాలెం నుంచి చౌటపాపాయపాలెం వెళ్లే దారిలో జగనన్న కాలనీ సమీపంలో కాలువ కట్ట తెగిపోయింది. దీంతో నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వందలాది ఎకరాల వరి పొలాలు నీట మునిగాయి. వెంకటాయపాలెం గ్రామంలో గల ఎర్రకుంట నిండిపోయి, పొంగడంతో చుట్టుపక్కల పొలాలు నీటిలో నానుతున్నాయి. పిల్లేరు వాగు భారీగా ప్రవహిస్తుండడంతో పాపాయపాలెం నుంచి పిడుగురాళ్లకు రాకపోకలు నిలిచిపోయాయి.

274 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

నరసరావుపేట రూరల్: భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 303 మంది రైతులకు చెందిన 274 హెక్టార్లలోని ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్ రమణారెడ్డి ఆదివారం తెలిపారు. పెదకూరపాడు డివిజన్‌లోని అమరావతి ప్రాంతంతో చిలకలూరిపేట డివిజన్‌లో పంటలకు ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. మిరప, పసుపు, అరటితో పాటు పూల తోటలు, కూరగాయల పంటలు, పండ్లతోటలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని వివరించారు. అమరావతి ప్రాంతంలో దాదాపు 120 హెక్టార్లలో మిరప పంట దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా ఉందని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 07464 (విజయవాడ–గుంటూరు), 07465 (గుంటూరు–విజయవాడ), 07755 (డోర్నకల్–విజయవాడ), 07756 (విజయవాడ–డోర్నకల్) మీదుగా రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. 17201 (గుంటూరు–సికింద్రాబాద్) 17202 (సికింద్రాబాద్–గుంటూరు), 12705 (గుంటూరు–సికింద్రాబాద్), 12706 (సికింద్రాబాద్–గుంటూరు) రైళ్లను కూడా సోమవారం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ధర్మవరం–మచిలీపట్నం(17216) రైలు, లింగంపల్లి–నరసాపూర్(17256) రైలు రద్దు చేశారు.

- విజయవాడ–గుంటూరు(07783), గుంటూరు–విజయవాడ(07779) నడికుడి–మాచర్ల(07579), మాచర్ల–గుంటూరు(07780), గుంటూరు–విజయవాడ(07788), కాచిగూడ–మిర్యాలగూడ(07276),మిర్యాలగూడ–నడికుడి(07277), నడికుడి–మిర్యాలగూడ (07973), మిర్యాలగూడ–నడికుడి(07974) రైళ్లను సోమ, మంగళవారాలలో రద్దు చేసినట్లు తెలిపారు.



పెదకూరపాడు మండలం బలుసుపాడు వద్ద నీటిలో పత్తి పంట



మాచర్లలో పొంగిపొర్లుతున్న చంద్రవంక వాగు



సాగర్ వద్ద కృష్ణానది ఉధృతిని తిలకిస్తున్న పర్యాటకులు

కన్నీటి ‘వరద’

- 60 మత్స్యకారుల గృహాలను చుట్టుముట్టిన వరదనీరు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పునరావాస కేంద్రానికి బాధితులు

దాచేపల్లి: కృష్ణమ్మ మహోగ్రరూపం మత్స్యకారుల పాలిట శాపంగా మారింది. కృష్ణానదిలో వరదనీరు భారీగా చేరటంతో మత్స్యకారుల కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. అర్ధరాత్రి కృష్ణానదిలోని వరద నీరు మత్స్యకారుల ఇళ్లను చుట్టేయటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. కాస్త ఆలస్యమైతే మా బతుకులు తెల్లారేయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం కృష్ణానది ఒడ్డున నివాసం ఉంటున్న 60 మత్స్యకారుల ఇళ్లలోకి శనివారం అర్ధరాత్రి వరదనీరు చేరటంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు వరద నీరు విడుదల చేయటంతో పాటుగా మూసీనది కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. వీటికి తోడు భారీ వర్షాల కారణంగా వరద నీరు కూడా చేరటంతో కృష్ణానది ఉగ్రరూపంతో ప్రవహిస్తుంది. నది ఒడ్డున ఉన్న మత్స్యకారుల కాలనీలోకి వరద నీరు చేరింది. ఇళ్లలోకి నీరు చేరటంతో సామగ్రి, ఇతర వస్తువులు నీటి మునిగాయి. కొంతమందికి చెందిన సామగ్రి, వస్తువులు, పడవలు, వలలు నీటిలో కొట్టుకుపోయాయి. మత్స్యకారులు అప్రమత్తమై అందుబాటులో ఉన్న సామాగ్రిని పడవల ద్వారా ఒడ్డుకు చేర్చారు. అక్కడ నుంచి ట్రాక్టర్ల ద్వారా గ్రామంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కొంతమంది వృద్ధులు వరద నీటిలో చిక్కుకుని ఒడ్డుకు చేరటం కష్టంగా మారటంతో కుటుంబ సభ్యులు అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. 60 నివాస గృహాల్లో ఉన్న మత్స్యకారులను అధికారులు ఖాళీ చేయించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు, సీఐ గుత్తి వెంకట్రావ్, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి, స్థానిక నాయకులు మత్స్యకారులను సురక్షితంగా తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. పునారవాస కేంద్రంలో సాగర్ సిమెంట్స్ యజమాన్యం భోజన వసతి కల్పించారు.



వరదనీటిలో కొట్టుకొచ్చిన పడవలు



వరద నీటిలో సామగ్రిని తరలిస్తున్న మత్స్యకారులు

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లా ఎస్పీతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటన

అమరావతి: కృష్ణానది ప్రవాహ ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా మండల పరిధిలోని నదీ పరివాహక గ్రామాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ఆదివారం అమరావతి, ధరణికోట గ్రామాలలో వరదముంపునకు గురైన ప్రాంతాలను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత 24గంటలలో 3800 మీ.మీ వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో నాలుగు మండలాలు మినహా మిగిలిన మండలాల్లో 100మి.మీ వర్షం కురవగా అమరావతి మండలంలో 12.7సెం.మీ వర్షపాతం నమోదయిందన్నారు. అమరావతి, అచ్చంపేట మండలాల్లో వర్షంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. ప్రస్తుతం రెండు మండలాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేనప్పటికీ లంకలలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ సాగుతుందన్నారు. ఇప్పటికీ లంక గ్రామాలలో ఉన్న 35మందితో పాటుగా 1150 గొర్రెలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. అలాగే పడవల వారితో పాటుగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. జిల్లా ఆరుచోట్ల సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి సుమారు 3000మందిని శిబిరాలకు తరలించామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరినీ సురక్షిత ప్రాంతాలకు చేరుస్తామన్నారు. ఇప్పటికి సుమారు 7 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వస్తుందని ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. వరదనీరు పెరిగితే ఏయే గ్రామాలు ముంపునకు గురవుతాయో గుర్తించి సహాయక చర్యలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తొలుత ధరణికోటలో వరదముంపునకు గురైన జైల్‌సింగ్ కాలనీని పరిశీలించారు. అనంతరం లంకలనుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పడవల రేవును సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ గనోయ్, సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ, ఎంపీపీ మేకల హనుమంతరావు, ధరణికోట సర్పంచ్ మాదాసు పావని పాల్గొన్నారు.



అధికారులు, పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ద్విచక్రవాహన చోదకుడిని కాపాడిన పోలీసులు

బొల్లాపల్లి: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో మండలంలో నాగులేరు, చప్పిడి వాగులు ప్రదేశాల్లో ఉధృతంగా ప్రవహించాయి. రాకపోకలకు అంతరాయం లేకుండా బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ చర్యలు చేపట్టారు. వెల్లటూరు సమీపంలోని చలంబాయి వాగు చప్టా పైనుంచి వరద నీటి ఉధృతికి వినుకొండ వైపు వస్తున్న ద్విచక్రవాహనచోదకుడు వాగులో పడిపోగా తక్షణమే స్పందించిన పోలీసులు అతడిని కాపాడారు. పొక్లెయిన్ సహాయంతో వాహనాన్ని బయటకు తీసి వాహనచోదకుడికి అప్పజెప్పారు. వెల్లటూరు గ్రామ సమీపంలోని చప్పిడి వాగు వద్ద బండ్లమోటు పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

చలంబాయి వాగులో పడిన ద్విచక్ర వాహన చోదకుడిని రక్షిస్తున్న పోలీసులు →



క్లుప్తంగా

పల్నాటి వీర్ల అంకాలమ్మకు బోనాలు



కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లికి ఆదివారం సాయంత్రం బోనాల ఉత్సవాన్ని యాదవ వర్గీయులు వైభవంగా నిర్వహించారు. కుంకుమ బండి కట్టుకుని బండి వెంట బోనాలతో మహిళలు తరలివచ్చి అంకాలమ్మ తల్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవార్ల దేవాలయాలకు వెళ్లి అక్కడ కూడా అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పాడి పంటలతో గ్రామాన్ని చల్లగా చూడాలని దేవతలను వేడుకున్నారు. ఇదిలా ఉంటే శ్రావణమాసం మొత్తం కూడా అమ్మవార్లకు గ్రామస్తులంతా విడతల వారీగా బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

యూపీఎస్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రయతిస్నున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)కు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు పేర్కొన్నారు. యూపీఎస్‌ను మన రాష్ట్రంలో అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూపీఎస్‌కు అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆదివారం గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన జరిగిన ప్రదర్శనలో బసవలింగారావు మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం భవిష్యత్తుకు భద్రత, గ్యారంటీ లేని దుర్మార్గపు యూపీఎస్‌ను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేయకపోతే పెద్ద ఎత్తున అన్ని సంఘాల్ని కలుపుకుని ఉద్యమిస్తామని తెలిపారు. అఖిల భారత పెన్షనర్స్ సంఘం నాయకుడు పి.నాగరాజు మాట్లాడుతూ ఏడాది కిందటే యూపీఎస్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకించారని తెలిపారు. అనంతరం లాడ్జి సెంటర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి ఓపీఎస్ అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో ఏపీఎస్జీవో నాయకుడు ఎం.ఎస్. మూర్తి, ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, పి. పార్వతి, కె.రమేష్, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎస్.ఎన్. మూర్తి, జి.దాస్, చక్కా వెంకటేశ్వర్లు, పి.శ్రీను, సీనియర్ నాయకులు కిశోర్, శివరామకృష్ణ, బాలరాజు, కోటేశ్వరరావు, సుబ్బారావు, గురుమూర్తి, సిద్దిక్, రామారావు, అప్పారావు, జహంగీర్, కిరణ్, వీరేశ్వరావు పాల్గొన్నారు.

పర్యావరణం విరాజాజిల్లు

- విత్తనబంతులతో సామాజిక అడవులు
- సత్ఫలితాలిస్తున్న పర్యావరణ వేత్త జాజి కృషి



విత్తన బంతి నుంచి వచ్చిన వేప మొక్క



విత్తన బంతుల నుంచి మొలిచిన మొక్కలను చూపుతున్న పర్యావరణ వేత్త జాజి



మొలిచిన చింత మొక్క

విత్తన బంతుల ద్వారా మొక్కలకు ప్రాణం పోయాలని కారెంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తోంది. ఆయన కారెంపూడి సమీపంలోని కాకిరాల రిజర్వ్ ఫారెస్ట్ మైదాన ప్రాంతాలలో చల్లిన విత్తన బంతుల నుంచి మొక్కలు వస్తున్నాయి. బంకమట్టి, పశువుల పేడ కలిపి మధ్యలో విత్తనం ఉంచి దానిని బంతిలా తయారు చేసి అడవిలో ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో జాజి వెదజల్లాడు. ఈ మహత్తర కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు సైతం జాజికి జత కలిశారు. వేలాది విత్తన బంతులు తయారు చేసి జాజికి అందివ్వడంతో పాటు వారు కూడా కొన్ని చోట్ల వెదజల్లారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ విత్తనబంతులు నాని వాటిపై మట్టి భూమితో కలసి ఆ విత్తనాలు భూమి నుంచి మొక్కలుగా బయటకు వస్తున్నాయి. తాము చేసిన ప్రయత్నం మంచి ఫలితాలనిస్తోందని జాజి తెలిపారు. కోటి విత్తన బంతులు చల్లాలనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి కొనసాగిస్తున్నానని జాజి తెలిపారు. - కారెంపూడి

వసంతరావుది ఆత్మహత్య కాదు హత్యే..!

డీటీపీ ఆపరేటర్ వసంతరావు మృతిపై బంధువుల అనుమానాలు

- చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి ముందు చీరాల రోడ్డుపై రాస్తారోకో
- నిష్పక్షపాత విచారణ నిర్వహించాలంటూ డిమాండ్
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా



ఆసుపత్రి ముందు చీరాల రోడ్డులో ఆందోళన నిర్వహిస్తున్న వారితో చర్చలు జరుపుతున్న అర్బన్ సీఐ రమేష్

చిలకలూరిపేట: ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడితే, రక్తపు మడుగులో ఎందుకు పడి ఉంటాడని, కారసాల వసంతరావుది ఆత్మహత్య కాదు... హత్యేనంటూ మృతుడి భార్య, బంధువులు ఆందోళనకు దిగారు. చిలకలూరిపేటలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల ముందు చీరాల రోడ్డులో ఆదివారం బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని దాసరి కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వసంతరావు మృతదేహం అదే ఆసుపత్రిలో శనివారం గుర్తించారు. ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శుక్రవారం సాయంత్రం విధులు ముగిసి, వైద్య సిబ్బంది వెళ్లిపోయాక లోపలి వైపు నుంచి తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత ఆసుపత్రి సిబ్బంది వచ్చి తలుపులు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యానుకు తాడు కట్టి ఉంది. వసంతరావు నేలపై తలకు గాయాలతో పడి ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది వసంతరావు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆసుపత్రి ముందు బంధువుల ధర్నా...

వసంతరావు మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆసుపత్రి వైద్యుడు, సిబ్బంది ఆయనను గత కొంతకాలంగా తీవ్రంగా వేధిస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఏరియా ఆసుపత్రి ముందు చీరాల రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వసంతరావుది ఆత్మహత్య కాదని, హత్య అని ఆరోపించారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో జిల్లా అధికారులతో విచారణ నిర్వహించి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలతో హోరెత్తించారు. అప్పటివరకు పోస్టుమార్టం నిర్వహించటానికి వీలులేదని, పోస్టుమార్టంను సైతం అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ పి.రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకు దిగిన వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా బాధితులు ఆందోళన విరమించలేదు. దీంతో చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, నరసరావుపేట పోలీసు అధికారులతో పాటు సిబ్బంది భారీగా ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. మరోమారు అర్బన్ సీఐ రమేష్ ఆందోళనకు దిగిన వారితో మాట్లాడారు. వసంతరావు మృతి విషయమై పారదర్శకంగా విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన విషయాలు డీఎంహెచ్‌ఓ వచ్చి అనుమానాలు నివృత్తి చేస్తారని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

డీఎంహెచ్ఓ చర్చలు

డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతుడి భార్య శిరీషా, బంధువులతో చర్చలు జరిపారు. మృతుడి ఇద్దరు పిల్లలకు పదోతరగతి వరకు రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచిత విద్య ఏర్పాటు చేస్తామని, భార్యకు ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. అయితే మృతికి నష్టపరిహారం చెల్లించాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో ఫోన్‌లో జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి పరిహారం విషయం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..



నా భర్త స్థానిక ఆస్పత్రి వైద్యులు తీవ్రంగా వేధింపులకు గురి చేసేవారని ఎప్పుడూ ఇంట్లో చెప్పుకొని బాధపడేవాడు. శుక్రవారం డ్యూటీకని వెళ్లి తిరిగి రాలేదు. రెండో రోజు ఆసుపత్రి నుంచి బంధువులకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం ఇచ్చారు. నా భర్త మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయి. నా భర్త ప్రాణాలు తీసి ఉసురు పోసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కారసాల శిరీషా, మృతుడి భార్య

ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు...



నా అన్న వసంతరావు ఆత్మహత్య చేసుకొనేంత పిరికివాడు కాదు. ఆగస్టు 29న మా అన్న బావమరది వివాహం ఉండటంతో నాలుగు రోజులు సెలవు పెట్టాడు. అయితే 30వ తేదీనే ఆసుపత్రికి రావాలంటూ ఫోన్ల మీద ఫోన్లు రావడంతో డ్యూటీకి వెళ్లాడు. ఆత్మహత్య చేసుకుంటే తలకు రక్తగాయాలు ఎందుకు ఉంటాయి. ఈ విషయమై అధికారులు న్యాయంగా విచారణ చేయాలి.

– కారసాల మరియబాబు, మృతుడి సోదరుడు

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి



గోళ్లపాడులోని కేజీబీవీ పాఠశాలలోని కిచెన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవి

నరసరావుపేట: వాయుగుండం ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా ప్రజలు అంటు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కాచి వడపోసి చల్లారిన నీటినే తాగాలని, అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే భుజించాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు చల్లటి గాలి, వానలో తడవకుండా ఉండాలన్నారు. టైర్లు, కొబ్బరి బొండాలు, వాటర్ బాటిళ్లు, రోళ్లు. ఇతర ఏ సామగ్రిలోనైనా నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే స్థానికంగా ఉన్న ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు తప్పకుండా సమాచారం అందించి దగ్గరలోని పీహెచ్‌సీ, యుహెచ్‌సీ, ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు పొందాలని సూచించారు.

కేజీబీవీ పాఠశాల సందర్శన..

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి చెప్పారు. మండలంలోని గోళ్లపాడు గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలను, రైతుభరోసా కేంద్రంలోని పునరావాసకేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆదివారం పరిశీలించారు. పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోయి పిల్లలకు ఇబ్బందికరంగా ఉండటాన్ని గమనించారు. పాఠశాల తరగతి గదుల్లోను, వరండాలోను, కిచెన్‌లోను పెద్ద ఎత్తున ఈగలు ఉండటాన్ని గమనించి వెంటనే శానిటేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈగల నివారణకు గాను ఫ్లై కిల్లర్ మిషన్‌ను కొనుగోలు చేసి విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసేవలందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రంలోని వైద్యశిబిరాన్ని పరిశీలించి, అక్కడే వైద్య సేవలందిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎం.జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై కాలయాపన వద్దు

పాత పెన్షన్ విధానం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్టీయూ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు చేస్తానని హామీఇచ్చి కాలయాపన చేస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం అమలు చేయాలని ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎస్టీయూ అంగీకరించదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)అమలు చేయడాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని అది ఉద్యోగుల హక్కన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధరబాబు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు మాట్లాడారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆర్థిక కార్యదర్శి ఎ.ఏమండీ, జిల్లా నాయకులు వినుకొండ అక్కయ్య, రామలింగయ్య, ఆంజనేయులు, జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ సీనియర్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన సీనియర్ పురుషుల, మహిళల జట్లతో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్కే ఎండీ రియాజ్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సీనియర్స్ పురుషుల, మహిళల ఫుట్‌బాల్ జిల్లా ఎంపికలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారిణులు వచ్చే నెల నుంచి గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు అని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. పురుషుల జట్టు వచ్చే నెల నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జట్ల ఎంపికలో పీడీలు ఎస్కే ఎండీ రియాజ్, ఐఎస్ నాగిరెడ్డి, ఎ.శ్రీరామ్, శ్రీనివాసరావు, రెడ్డి, ఎస్ఎం సుభాని, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనిల్, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు. **మహిళల జట్టు:** జై.మహేశ్వరి (మాధల), ఎం.మహేశ్వరి, ఆర్.కావ్యలక్ష్మి, ప్రసన్న(రామకృష్ణాపురం), ఆర్.పుష్పలత (మాదల), ఎస్.శ్రావణి (ఇరుకు పాలెం), షరీన్ (మాదల), ఎస్.శ్రావ్య (మాదల), బి.చంద్రిక (సత్తెనపల్లి), బి.అశ్విని, సిహెచ్ వెంకట ప్రియ (రామకృష్ణాపురం), శ్వేత (సత్తెనపల్లి), కె.త్రివేణి (సత్తెనపల్లి), ఎం.హర్షిత (ముప్పాళ్ళ), అలేఖ్య (సత్తెనపల్లి), ప్రవల్లిక (సత్తెనపల్లి), బి.సాయి (కొమరెపూడి), గాయత్రి, సౌజన్య (సత్తెనపల్లి), ఎస్.మంజుల (సత్తెనపల్లి), ఎస్.మౌనిక (సత్తెనపల్లి), పి.విజయలక్ష్మి (దూళిపాళ్ల), పి.ప్రత్యూష (దూళిపాళ్ల)

పురుషుల జట్టు: చింతలపూడి రాజు (మాదల), శ్యామ్‌కుమారు (మాదల), టి.కల్యాణ్‌రామ్ (మాదల), అంకమ్మరావు (మాదల), కె.శ్రీనివాసరావు, సీహెచ్ రాజు (మాదల), ప్రదీప్ (మాదల), ఎం.బాబురావు, సీహెచ్ సాకేత్ (సత్తెనపల్లి), ఎం.షరీఫ్ (సత్తెనపల్లి), కె.ఆకాష్ (సత్తెనపల్లి), ఎండీ రఫీ (సత్తెనపల్లి), కె.నరేష్ (మాదల), పి.శివమణి (సత్తెనపల్లి), ఎస్కే ఎండీ ఇర్ఫాన్ (మాదల), పి.యాసిన్ ఖాన్ (ఇరుకుపాలెం), డి.శివ సాయికృష్ణ (సత్తెనపల్లి), కె.ప్రవీణ్ కుమార్(సత్తెనపల్లి), సిహెచ్ వెంకటేశ్వర్లు(సత్తెనపల్లి), జి.వెంకటేష్, టి.సాయి (మాధల), టి.ఆకాష్ (మాదల) ఎంపికయ్యారు.

ఆట ముగిసింది... శ్వాస ఆగింది

స్టేడియంలోనే కుప్పకూలిన షటిల్ ప్లేయర్



వెంకట రాంబాబు(ఫైల్)

తెనాలి రూరల్: చివరి నిమిషం వరకూ అడుతూనే ఉండాలి.. అడుతూనే శ్వాస ముగించాలి అని పలుమార్లు సహచర క్రీడాకారులతో పదే పదే చెప్పేవారు ఆయన. అలాగే ఆట ముగిసింది. అదే క్షణంలో శ్వాస ఆగింది. అప్పటి వరకూ ఆటలో పోటీ పడిన ఆయన అదే స్టేడియంలో తుది శ్వాస విడిచారు. తోటి క్రీడాకారులు, కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచిన షటిల్ బ్యాట్మింటన్ క్రీడాకారుడు పోచిరాజు వెంకట రాంబాబు వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పోచిరాజు వెంకట రాంబాబు(56) మంచి క్రీడాకారుడు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ అంటే అతనికి ప్రాణం. ట్యూషన్ టీచర్‌గా గ్రామంలో జీవితాన్ని ప్రారంభించిన ఆయన తెనాలి వహాబ్ రోడ్డులోని సంస్కార్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. కాలక్రమంలో పౌరోహిత్యం నేర్చుకుని పురోహితునిగా జీవనం సాగిస్తున్నారు. కొలకలూరులోని కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్(కిస్బా) ఉపాధ్యక్షులుగా ఉన్న ఆయన ప్రతి రోజు ఉదయం షటిల్ బ్యాడ్మింటన్ ఆడటం అతని దినచర్యలో భాగం. ఆ క్రమంలో వర్షం కారణంగా కిస్బా కోర్టు జలమయం కావడంతో తెనాలి ఇండోర్ స్టేడియానికి వెళ్లారు. అక్కడ డబుల్స్ గేమ్ ప్రత్యర్థులతో పోటీ పడ్డాడు. ఇరు జట్లు చెరో సెట్ గెలవగా మూడో సెట్‌లో పోటీ పడ్డారు. ఆట ముగిసింది. రెండు జట్లు కోర్టు నుంచి అడుగు బయట పెడుతుండగానే రాంబాబు కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి క్రీడాకారులు సపర్యలు చేశారు. క్షణాల్లో కూతవేటు దూరంలో ఉన్న తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో క్రీడాకారులంతా కన్నీటి పర్యంతరమయ్యారు. అప్పటి వరకూ తమతో చలాకీగా ఆడిన మిత్రుడు విగతజీవిగా మారటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతికి కిస్బా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్. వినియకుమార్, సభ్యులు కె. జార్జిథామస్, ఎస్కే కరీముల్లా, కె. కిరణ్మయి, ఎస్. మురళీధర్, పి.సురేష్ బాబు, కె. శ్రీకాంత్, వసంతరావు, సీహెచ్ నాగరాజు, సత్యనారాయణ, శివ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరాంబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మేధకు పదును



ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రొఫెసర్ పార్థసారథి, శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల్లో మేధకు పదును పెట్టవచ్చని కేఎల్ యూనివర్సిటీ బేసిక్ ఫౌండేషన్ ప్రొఫెసర్ పి.పార్థసారధి అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులో యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం(యూసీ మాస్) విద్యార్థులు మెదళ్లకు పదును పెట్టి తయారుచేసిన రోబోటిక్స్ చంద్రయాన్, అగ్రికల్చర్ రోబో, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, స్మార్ట్ విలేజ్, కేరమ్ రోబోట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ చిన్న వయసులోనే రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అబాకస్ వంటి సాంకేతిక విద్యను విద్యార్థులకు నేర్పించడం ద్వారా భవిష్యత్ మేధో సంపన్న శాస్త్రవేత్తలుగా రాణిస్తారని తెలిపారు. శ్రీ రైనా టెక్నాలజీస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలతోనే ముడిపడి ఉందని చెప్పారు. యూసీ మాస్ శిక్షణ ద్వారా ఆరేళ్ల వయసు నుంచి 18 ఏళ్ల విద్యార్థుల వరకు రోబోట్ మోడల్స్‌పై కోడింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, గణితంలో అబాకస్ మూడు సంవత్సరాల శిక్షణల ద్వారా ప్రత్యేక గ్రాడ్యుయేషన్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. వీవీఐటీ ప్రొఫెసర్ డీవీ శేషగిరిరావు, పీపుల్స్ ట్రామా వైద్య నిపుణుడు కె.వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ఎంఈఓ టీవీ రామిరెడ్డి ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. యూసీ మాస్ ప్రతినిధి ఎం.శ్రీకాంత్, టెక్నికల్ మోడరేటర్స్ రమ, పూజ, నందిని పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదన రావుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినాన పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.మధుసూదనరావుపై గతంలో కూడా ఏసీబీ కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కేసు ముగిసే వరకు ప్రధాన బాధ్యతలు ఇవ్వకూడదని నిబంధన ఉన్నా కూడా ఆనాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో మాట్లాడుకొని సోషల్ వెల్ఫేర్‌తో పాటు బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల ఇన్‌చార్జిల బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. నెలలో కనీసం డీడీ 20 హాస్టల్స్ పర్యవేక్షించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశాలు ఉన్నా ఇప్పుడు వరకు ఎన్ని పర్యవేక్షించారని ప్రశ్నించారు. జిల్లా కార్యాలయంలో వారంలో రెండు రోజులు కూడా ఉండరని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీలో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గసాయి, గణేష్, బన్నీ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

సత్తెనపల్లి: వాతావరణంలో వచ్చిన మార్పులు, భారీ వర్షాల కారణంగా పల్నాడు జిల్లాలో జ్వరాలు విపరీతంగా ఉన్నాయని, జ్వరాల బారిన పడ్డ వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలోను, పీహెచ్‌సీలలోను మందులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా ఉన్న వార్డులు, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు పక్కన ఉన్న పొలాలు కోతకు గురై పంట నష్టం జరిగిందని, వారికి పంట నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవను వెంటనే వారికి ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి కూడా అన్నదాత సుఖీభవ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, జి.రవి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు ధరణికోట విమల, గుంటుపల్లి బాలకృష్ణ, గుంటూరు మల్లేశ్వరి, హనుమంత్ రెడ్డి, పెండ్యాల మహేష్ పాల్గొన్నారు.